

# 4. నోర్ముయ్

ఈ మాట పదే పదే చెవుల్లో వినపడుతుంటే భరించలేక చెవులు కూడా మూసుకుంది జానకి. ఈ మాటతో పరిచయం ఒక్కనాటిది కాదు. ఒక సంవత్సరానిదీ కాదు. ఊహ తెలిసిన క్షణం నుంచీ ఎప్పుడూ ఎవరో ఒకరు జానకిని ఈ మాట అంటూనే వున్నారు.

చిన్నతనంలో ఎక్కడ ఏం చూసినా, ఏం జరిగినా పట్టలేని సంతోషమో కోపమో బాధో కలిగేవి. వాటిని అమ్మకో నాన్నకో చెప్పాలని పరిగెత్తేది. తన ఆవేశాన్నంతా ప్రదర్శిస్తూ చెప్పబోతే వాళ్ళు వెంటనే —

“నోరు మూసుకుని అవతలకు నడువు, ఎక్కడ లేని సంగతులూ నీకే కావాలి” అని కసిరేవాళ్ళు.

అమ్మా నాన్నలే కాదు. అమ్మమ్మ, తాతయ్య, నాయనమ్మ, అత్త, పిన్ని, మామయ్య, బాబాయి అందరూ అంతే.

“ఎందుకట్లా వాగుతావు” అనేవారు.

“ఆడపిల్లకంత నోరు పనికి రాదు” అనేదీ అత్త ఎంత. నోరు తనది ?

పెళ్ళి అద్దంలో చూసుకుంటే ఎర్రని పెదవులతో బుల్లి నోరు కనిపించింది. ఇంత చిన్ని మూతిని పట్టుకుని ఎందుకలా అంటుంది?

ఇంత చక్కని మూతి మీద వాత పెడతానని అమ్మ ఎందుకంటుంది ?

ఆడపిల్లలకు నోరు ఎందుకుండకూడదు ?

అన్నలూ తమ్ముళ్లూ ఊరిమీద పడి తిరుగుతుండేవారు. అన్నాల వేళకొచ్చి అన్నం తినడం, నిద్రపోవడం. వాళ్ళు బయట తిరిగి ఆడేటప్పుడు హాయిగా అరుచుకుంటారు. మాట్లాడుకుంటారు.

అన్నలు కాలవలో ఈతకి దూకుతూ ఎల్లా అరుస్తారనీ....!

జానకి ఒక రోజు పెరట్లో తొట్టి నిండా నీళ్ళు వున్నప్పుడు, తొట్టి అంచు మీద నిలబడి పెద్దగా అరుస్తూ తొట్లోకి దూకింది.

తొట్లో నీళ్ళన్నీ ఆనందంతో చిందులేసేసరికి జానకి సంతోషం పట్టలేక మరి రెండు కేకలేసింది. గట్టిగా గొంతు నరాలు పొంగేలా అరిచింది.

నాయనమ్మా, నాన్నా ప్రత్యక్షమయ్యారు.

నాన్న ముఖం అసహ్యంగా చేసుకుని జానకిని తొట్లోంచి ఎత్తిబైటపడేశాడు. బట్టలు లేని జానకిని చూసి చీదరించుకుంటూ "సిగ్గు లేదు" అని తిడుతూ వెళ్ళిపోయాడు. అన్ననూ తమ్ముళ్ళనూ కాలవకి స్నానానికి తీసికెళ్ళి వాళ్ళు బట్టలు విప్పుకుని ఈత లేస్తుంటే నవ్వి నవ్వి. అలసిపోయే నాన్న !

తనను కాలవకెలాగూ తీసికెళ్ళడు. ఇంట్లో తొట్లో దిగకూడదూ? అప్పుడు బట్టలెందుకు? ఈమాటే నాయనమ్మ నడిగితే వీపు మీద రెండు అంటించి "నోరు మూసుకోవే సిగ్గుమాలినదానా" అన్నది.

మాటలు నోట్లో నుంచి వస్తున్నాయేగాని అసలు పుట్టడం తలకాయలో నుంచి పుడుతున్నాయని వయసు వస్తున్న కొద్దీ జానకి గ్రహించింది. అందుకే—

"నీ నోరు కుట్టెయ్యాలి" అని అత్త అంటే జానకి పకపకా నవ్వింది.

"నీకు తెలియదా? మాటలు పుట్టేది ఇక్కడ. నోట్లోనుంచి వస్తున్నాయంతే" అని తలకాయ మీద కొట్టుకుంది.

"నీ తెలివి మండినట్టే వుంది" అని వీపు మీద దబ దబా బాదింది అత్త.

తలకాయలో మాటలు పుడుతున్నప్పుడు వాటిని వెంటనే బైటికి రానీయకూడదనీ, కొన్నింటిని అసలు రానీయకూడదనీ, జానకికి ఆలస్యంగానైనా అర్థమయింది.

మాటల సంగతి సరే — తన మాటలు పెద్దవాళ్ళకు అర్థం కావు. కోపం వస్తుంది. వాళ్ళ మాటలకు తనకు ఏడుపొచ్చినట్టే తన మాటలకి వాళ్ళకూ కోపం వస్తుందేమో.

కానీ నవ్వు— నవ్వేం చేసింది?

నవ్వితే ఎవరికైనా బాధ ఎందుకు? కోపం ఎందుకు? అందునా జానకికి నవ్వు పెదవుల మీదనే వుంటుందా అన్నంత తొందరగా వచ్చేస్తుంది. ఇంటా బయటా ఎన్నో చిత్రాలు! ఎన్నో తమాషాలు! అన్నిటికీ నవ్వు వస్తుంది. ఎట్లా ఆపాలి? నవ్వు వచ్చేవన్నీ ఎదురుగా కన్పిస్తున్నా నవ్వకూడదు! నవ్వితే కొడతారు గదా? కొడితే నొప్పేస్తుంది. గదా? నొప్పికి ఏడుపొస్తుందా— ఏడవగూడదు.

నొప్పి పుట్టేలా కొట్టి ఏడవ వద్దంటున్న పెద్దాళ్ళను చూసి ఆశ్చర్యపోయేది జానకి. "కొట్టకపోతే ఏడవదుగా" అనడగింది ఒకసారి తండ్రి తమ్ముడ్ని కొట్టి ఏడవవద్దని గదుముతుంటే.

"నువ్వు నోరు మూయకపోతే నీకూ పడతాయి. వెధవ ప్రశ్నలని వెధవ ప్రశ్నలు. ఏం లేకపోయినా నోరొకటి ఇచ్చాడు దేవుడు" నాన్న కోపం ఇటు తిరిగింది.

దేవుడు నోరిచ్చాడు. నోటితో మాట్లాడతారు, నవ్వుతారు, ఏడుస్తారు.

మరి ఇదేమీ చెయ్యొద్దంటారెందుకు? ఇవన్నీ చెయ్యకూడనివైతే దేవుడు నోరివ్వడం ఎందుకు? జానకి చిన్ని బుర్ర అంతకు మించిన ఆలోచన భరించలేక పోయేది. ఎదురుగా కనబడుతున్న ఏ చెట్టునో పట్టుకుని ఈ విషయం వదిలేసేది.

జానకికి క్రమంగా ఎన్నో చిత్రమైన విషయాలు తెలిశాయి.

ముందు చిన్న పిల్లలను పెద్దవాళ్ళు నోరు ముయ్యమంటారని అర్థమైంది.

తర్వాత చిన్న పిల్లల్లో కూడ ఆడపిల్లలు ఎక్కువసార్లు నోరుమూసుకోవాలని అర్థమైంది. ఐతే ఊహ పెరిగే కొద్దీ పెద్ద ఆడవాళ్ళను కూడా మగవాళ్ళు నోరు ముయ్యమంటారని తెలిసింది. నాన్న అమ్మ, నాయనమ్మలను చాలాసార్లు 'నోరు మూసుకోండి' అనేవాడు. ఆడపిల్లలు పెద్దయినా తోటి ఆడవాళ్ళతోనే మెల్లిగా మాట్లాడాలి గానీ మగాళ్ళ దగ్గర నోరు మూసుకునే వుండాలి అనుకుంది జానకి. ఐతే జానకి ఇంకో మహా చిత్రమైన విషయం కనిపెట్టింది.

నాన్నా, అమ్మా— ఒకరేమిటి ఇంట్లో ఆడా మగా పిల్లలతో సహా అందరూ అందరికంటే పెద్దాడైన ఎంకటి గాడిని నోరుమూసుకోరా అంటారు. జానకికి కూడా వెంకటిని 'నోరు మూసుకో' అని అందామని చాలాసార్లు అనిపించింది.

కానీ ఎంకటి జానకితో చాలా మంచి కబుర్లు చెప్పేవాడు.

దూడలు అరిస్తే వాటి భాషలో అవి ఏమంటున్నాయో చెప్పేవాడు. పిట్టలు జామ చెట్టుమీద మీటింగ్ పెట్టుకుని ఏం మాట్లాడుకుంటున్నాయో చెప్పేవాడు. మబ్బులు తొందర తొందరగా ఇళ్ళకెందుకు పరిగెత్తుతున్నాయో చెప్పేవాడు. మబ్బులు పొట్టల్లో నీళ్ళు పెట్టుకుని గబగబా ఇంటికి పరిగెత్తి కుండల్లో నింపుకోవడం, ఇల్లు చేరలేకపోతే ఆ నీళ్ళన్నీ కారిపోయి వర్షంగా కురవడం ఎంకటి చెబుతుంటే నోరు తెరుచుకుని వినేది జానకి. 'నోరుమూయ్ ఏంటా వాగుడు' అనాలని మర్చిపోయేది.

మళ్ళీ ఎంకటిగాడు చెప్పే ఆ మాటలే అమ్మకో నాన్నకో చెప్పబోతే వాళ్ళు జానకిని 'నోరుమూసుకో'మనే వాళ్ళు. బీదవాళ్ళనీ, తక్కువ కులం వాళ్ళనీ, ఆడాళ్ళనీ నోరుమయ్యమని అంటారని జానకి గ్రహించింది.

అప్పట్నించి జానకి అతి తక్కువ మాట్లాడడం ప్రయత్న పూర్వకంగా అలవరచుకుంది.

బళ్ళో, ఇంట్లో నోరు విప్పకుండా పనులు చేయడం నేర్చుకుంది.

జానకిని అందరూ మెచ్చుకున్నారు.

తలకాయలో పుట్టే మాటలను ఆపెయ్యడం కోసం కృషి చేసిన జానకి తన తలకాయలో మాటలు పుట్టడం క్రమంగా తగ్గిపోతోందని గ్రహించలేకపోయింది, మాట్లాడకుండా వుంటే తనలో కలిగే అశాంతి క్రమంగా తగ్గిపోతోందని సంతోషించిందే కాని తనకున్న ఊహాశక్తి పోతోందని తెలుసుకోలేకపోయింది.

చిన్నతనంలో వాడిన కొమ్మలనూ రాలిన పువ్వులనూ చూసి వాటి కోసం బాధపడి వాటి దుస్థితిని నలుగురికీ చెప్పాలని ప్రయత్నించే జానకి ఈవాళ తన ఎదురుగా మనుషులు బాధపడుతున్నా ఏమీ మాట్లాడలేని దుస్థితికి వచ్చింది. నిశ్శబ్దంగా ఏడవటం తప్ప ఏమీ చెయ్యలేక పోతోంది.

పిట్టల అరుపులకూ, లేగ దూడల గంతులకూ చిందులు వేసే జానకి ఇప్పుడు తన ఎదురుగా ఎంత సంబరం జరుగుతున్నా చిరునవ్వుతో నిశ్శబ్దంగా నిలబడడం నేర్చుకుంది.

జానకికి పెళ్ళయింది. వరుడు అందగాడు. మంచి ఉద్యోగస్తుడు. జానకి తనలో తాను మురిసి పోయింది.

అయితే ఆ మురిపెం పోయి దాని స్థానంలో భయం ప్రవేశించడానికి ఎంతో కాలం పట్టలేదు.

"ఏంటా చూపులు-మూంగిలా మాట్లాడవేం" జానకి భర్తకు జానకి మౌనంతో చిరాకు వచ్చేది. ఏం చెప్పినా విని ఊరుకునే జానకి, బదులివ్వకుండా చెప్పిన పని చేసే జానకి అతనికి చాలా అసహనం కలిగించింది.

తన భర్తకు మాటలూ కబుర్లూ కావాలని అర్థమయ్యేసరికే జానకి చెంపలు వాచిపోయాయి. జానకి మళ్ళీ మాటలు నేర్చుకోవడం మొదలు పెట్టింది. నోరు విప్పడం మొదలు పెట్టింది. తనకు కలిగిన ప్రతి అనుభూతినీ మాటల్లో చెప్పడం ఒకప్పుడెంతో తేలికగా వుండేది.

ఇప్పుడలా కాదు.

ఇప్పుడు మాటల కోసం యుద్ధం చేయవలసి వస్తోంది.

మెదడులో యుద్ధం, గొంతులో యుద్ధం, నాలుక మీదా, పెదవుల పైనా యుద్ధం. ఈ యుద్ధంలో అపజయం కలిగినా అలసట కలిగినా జానకి ప్రయత్నం మానలేదు.

నెమ్మది నెమ్మదిగా నడకరాని బిడతడు పడుతూ లేస్తూ నడక నేర్చినట్టు మాటలు నేర్చింది. జానకిలో మార్పుకి భర్త కూడా సంతోషించాడు.

జానకి అతనికేం కావాలో, అతని ఇష్టాలేమిటో అడిగి కనుక్కుంటున్నప్పుడూ, అతని ఇష్టాలు తీరుస్తానని చెబుతున్నప్పుడూ అతను చాలా సంతోషించాడు.

అతని పనులనూ ప్రవర్తననూ అందాన్నీ జానకి ముచ్చటైన మాటల్లో మెచ్చుకుంటుంటే అతను నిజంగానే సంతోషించాడు. ఐతే జానకి మాటలు అంతటితో ఆగలేదు. జానకి చిలక కాదు. మనిషి. జానకి మరికొన్ని విషయాలు అడగడం, మాట్లాడడం మొదలు పెట్టేసరికి భర్తకు మళ్ళీ చిరాకు మొదలయింది.

కనుబొమ ముడితో ప్రారంభమైన ఆ చిరాకు క్రమంగా జానకి మాటలతో పాటు పెరిగింది, ఒకానొకరోజు బద్దలయింది.

"నోర్మూయ్ - ఆడదానికంత నోరు పనికి రాదు"

"ఆడదానివి నోరుమూసుకుని పడుండు"

భర్త ఈ మాటలన్న రోజు జానకి పిచ్చిగా నవ్వింది. కళ్ళల్లో నుండి నీరు కారేలా నవ్వింది. నవ్వి నవ్వి నిలబరలేక మంచం మీద పొర్లింది. "ఏంటా విపరీతపు నవ్వు ఆడదానివేనా ?

జానకిక్కి నవ్వాగడం లేదు.

ఆ నవ్వు ఏడుపుగా మారేవరకూ ఆగదు కూడా.

"నోర్మయ్-నోర్మయ్"

జానకి చెవుల్లో ఆ మాట మారుమోగుతోంది. చెవులు మూసుకున్నా సరే-

ఆ మాట చెవుల ద్వారా వచ్చినప్పటికీ తలకాయలో పుట్టింది. రక్తంలో ఇంకింది.

— ఆంధ్రజ్యోతి వారపత్రిక, 8-6-90